సాక్షి మంచిర్యాల

ఆదివారం । 29 । జనవరి । 2023



సేంద్రియ సాగు చేద్దాం...

చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామానికి చెందిన యువరైతు గోనె సతీశ్ 14ఏళ్లుగా సేంద్రియ ఎరువులతోనే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ లాభాలు గడిస్తున్నాడు. 8లో▸



కొనసాగుతున్న నాగోబా జాతర

ఈ నెల 21న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. అధికారికంగా ముగిసినా ఆదివారం వరకు కొనసాగించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /17.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థినిని ప్రశ్నిస్తున్న డీఐఈఓ శైలజ

బెల్లంపల్లి: ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఐఈఓ శైలజ సూచించారు. శనివారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. వార్షిక పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అనంతరం 2023–24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ డ్రైవ్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సత్తయ్య

మంచిర్యాలక్రైం: ఫిబ్రవరి 11న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా జడ్జి బి.సత్తయ్య అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జిల్లాలోని పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్, రెవెన్యూ, ఇన్సూరెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులతో మాట్లాడి రాజీ కుదిర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పే అంతిమ తీర్పు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి మైత్రేయి, అర్పిత, వైష్ణవి, ఉపనిషద్వని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి'



ఏసీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల డెవలప్‌మెంట్ ఫోరం నాయకులు శనివారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏసీఈ శేషారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం కన్వీనర్ గోనె శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏసీడీ చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపిందని ధ్వజమెత్తారు. తక్షణమే ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని, ప్రతీనెల 30 రోజుల్లో మీటర్ రీడింగ్ బిల్లులు వినియోగదారులకు అందజేయాలని అన్నారు. 30 రోజుల తర్వాత బిల్లులు తీయడం వల్ల యూనిట్లు పెరిగి బిల్లుల్లో వ్యత్యాసంతో కరెంటు చార్జీలు అదనంగా వస్తున్నాయన్నారు.

'పది' పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి



విద్యార్థులతో ఆర్జీవో గోపీనాథ్

చెన్నూర్: పదోతరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆర్జీవో గోపీనాథ్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు సైతం కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం అధిగమించాలన్నారు. అనంతరం ఇంటర్నల్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ఆయన వెంట జిల్లా కన్వీనర్ శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ కృపాసాగర్, డిప్యూటీ వార్డెన్ నాగజ్యోతి ఉన్నారు.

కొత్త రైళ్లు కూత పెట్టేనా?

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31నుంచి మొదలుకానున్నాయి. ఫిబ్రవరి 1న సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. మంచిర్యాల నుంచి సిర్పూర్(టి) వరకు ఉన్న రైల్వేస్టేషన్లలో కొన్నేళ్లుగా అనేక సమస్యలు పెండింగ్ లోనే ఉంటున్నాయి. ఇక్కడి ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తరచూ సమస్యలు విన్నవిస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరంగా భావిస్తున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఇబ్బందులు తీర్చేలా చేస్తారని రైలు ప్రయాణికులు ఆశలు పెట్టుకుంటున్నారు.



మంచిర్యాల రైల్వేస్టేషన్

- ఎన్నిసార్లు విన్నవించినా మొండిచేయే..
- రైల్వే స్టేషన్లలోనూ అనేక సమస్యలు
- మంచిర్యాల నుంచి సిర్పూర్ వరకు ఇదే తీరు
- కేంద్ర బడ్జెట్‌పైనే ప్రయాణికుల ఆశలు



రేచినిరోడ్ రైల్వేస్టేషన్‌లో తవ్విన గుంతలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పేద, మధ్యతరగతి ప్రజలకు రోడ్డు రవాణాతో పోలిస్తే రైలు ప్రయాణం అతి తక్కువ ఖర్చుతో కూడుకుంది. అంతేకాకుండా సమయం ఆదాతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువ. ఈ కారణంగా అధికశాతం ప్రజలు మొదట రైలు మార్గాన్నే ఎంచుకుంటున్నారు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు, కాజీపేట, వరంగల్, సికింద్రాబాద్ వైపు నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రాలుగా ఉన్న మంచిర్యాల వంటి పెద్దస్టేషన్‌తో పాటు కుమురం భీం జిల్లా సిర్పూర్(టి) స్టేషన్ వరకు ఎన్నో సమస్యలు ఏళ్లుగా అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. రైల్వే ఉన్నతాధికారుల పర్యటనల్లో ఈ సమస్యలు ఎప్పటికప్పుడు విన్నవిస్తున్నా ఫలితం శూన్యం.

కొత్త రైళ్లు నడపాలి

పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న మంచిర్యాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దు మహారాష్ట్ర వరకు రైలు ప్రయాణికులు ఉన్నారు. ఉదయం భాగ్యనగర్, ఇంటర్‌సిటీ తర్వాత అందరికీ అందుబాటులో మళ్లీ ప్యాసింజర్ రైళ్లు లేవు. సాయంత్రం సికింద్రాబాద్ నుంచి భాగ్యనగర్ తర్వాత ఇటువైపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు లేవు. ఈ క్రమంలో బల్లార్షా నుంచి తిరుపతికి, గద్వాల– సిర్పూర్ కాగజ్‌నగర్, వయా కాచిగూడ, మెమూ ఎక్స్‌ప్రెస్, కాజీపేట–ఆదిలాబాద్ వయా మంచిర్యాల, బల్లార్షా, మ్రాజీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, కాజీపేట జంక్షన్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్ వరకు ఉదయం 8 గంటలకు ఒక ట్రైన్ నడపాలని విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధి కోసం రాకపోకలు సాగించేవారు కోరుతున్నారు. ఇక కరోనా సమయంలో రద్దు చేసిన ఆనంద్ వన్, తడోబా ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరణకు నోచుకోలేదు. కాజీపేట వరకు మూడోలైన్ పూర్తయినప్పటికీ కొత్త ట్రైన్లు అందుబాటులోకి రాలేదు. రేచిని, మందమర్రి, ఆసిఫాబాద్‌రోడ్ స్టేషన్లలో కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఇవ్వడంలేదు.

తాగేందుకు నీళ్లు లేవు



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో తాగేందుకు నీళ్లు కూడా లేవు. నల్లా నీళ్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఉన్న వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. మరుగుదొడ్లు ఒకవైపే ఉండడంతో మాలాంటి వృద్ధులకు ఇబ్బంది అవుతోంది.

– దెబ్బటి మల్లయ్య, ప్రయాణికుడు, కాగజ్‌నగర్

బ్రిడ్జి పూర్తి చేయాలి



రేచిని రోడ్ రైల్వే స్టేషన్‌కు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరై నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తికాలేదు. ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య హైదరాబాద్‌కు వెళ్లేందుకు రైలు ఉండాలి. ఈ బడ్జెట్‌లో కొత్త రైళ్లు మంజూరు చేయాలి.

– బోనగిరి వెంకటరమణ, వ్యాపారి, తాండూర్

సౌకర్యాలు కల్పించాలి

స్టేషన్‌లో అడుగుపెడితే ప్లాట్ ఫాం టికెట్ వసూలు చేసే అధికారులు తాగేందుకు సురక్షితమైన నీరు అందుబాటులో ఉంచడంలేదు. చల్లని నీరు లేక వేసవిలో మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. మరుగుదొడ్లు అన్నిచోట్ల మొదటి ప్లాట్‌ఫాం వైపే ఎక్కువగా ఉండడంతో మరోవైపు ప్లాట్‌ఫాం ఉన్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మంచిర్యాల స్టేషన్‌లో హమాలివాడ వైపు నుంచి వచ్చే ప్రయాణికులకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ఇబ్బంది పడుతున్నారు. అమృత్ పథకంలో మంచిర్యాల స్టేషన్ ఎంపిక కావడంతో ఇటీవలే అభివృద్ధి పనులు మొదలయ్యాయి. క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద బ్రిడ్జి పూర్తికాకపోవడంతో వాహనదారులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. రవీంద్రఖని, మందమర్రి స్టేషన్లలో సౌకర్యాలు లేవు. బెల్లంపల్లి రెండో ప్లాట్‌ఫాం వైపు పూర్తిస్థాయిలో నిలువ నీడ లేక, వేసవి, వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. స్టేషన్ ఆవరణలో టికెట్ ఏటీఎం సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. క్యాంటీన్ తెరుచుకోవడం లేదు. రేచిని రోడ్ రైల్వేస్టేషన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి స్టేషన్‌కు వెళ్లేందుకు పక్కారోడ్డు లేదు. భాగ్యనగర్ ట్రెయిన్‌కు వెళ్లే ప్రయాణికులు లైటింగ్ సమస్యతో చీకట్లో నిలిచిఉన్న రైళ్ల కిందనుంచి పట్టాలు దాటాల్సిన దుస్థితి నెలకొంది. కుమురం భీం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రధానంగా ఉన్న ఆసిఫాబాద్‌రోడ్డు (రెబ్బెన) ప్రయాణికులకు అరకొర వసతులే ఉన్నాయి. కాగజ్‌నగర్ స్టేషన్, సిర్పూర్(టి) స్టేషన్లలోనూ ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పార్కింగ్, టికెట్ కౌంటర్లు ఒకవైపే ఉంటున్నాయి. మంచిర్యాలలో రెండోవైపు కూడా ఏర్పాటు చేయాలని రైలు ప్రయాణికులు కోరుతున్నారు.



కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో పనిచేయని యంత్రం



పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

ప్రజలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్

- డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రజలకు మాత్రమే పనిచేస్తుందని, నేరస్తులకు, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారికి కాదని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ములుగు జిల్లా అడిషనల్ ఎస్పీగా ఉన్న ఆయన పదోన్నతిపై మంచిర్యాల డీసీపీగా బదిలీ అయ్యారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన డీసీపీని పలువురు జిల్లా పోలీస్ అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరు నిర్భార్థంగా ప్రజలకు సేవలందించాలన్నారు. పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో ఎలాంటి సమస్యలున్నా చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. డీసీపీని కలిసిన వారిలో బెల్లంపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, జైపూర్ ఏసీపీ నరేందర్, స్థానిక సీఐ నారాయణ్ నాయక్, మందమర్రి సీఐ ప్రమోద్‌రావ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాత మంచిర్యాల: 2023–24 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కోసం ఎంపిక చేయడానికి జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలోని షెడ్యూలు కులాలకు చెందిన విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందించడానికి ఆసక్తి కలిగిన విద్యాసంస్థలు హాస్టల్, మౌలిక వసతులు కలిగి ఉండాలన్నారు. గడిచిన ఐదేళ్లలో పదో తరగతిలో 90 శాతం ఉత్తీర్ణతతో పాటు 50 శాతం విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు చెల్లించే స్కూల్ ఫీజులు ఒకటో తరగతి నాన్ రెసిడెన్సియల్‌కు రూ.20 వేల నుంచి రూ.28 వేలకు, ఐదో తరగతి రెసిడెన్సియల్‌కు రూ.30 వేల నుంచి రూ.42 వేలకు పెంచినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిబ్రవరి 10 లోగా జిల్లా షెడ్యూలు కులాల ఉపసంచాలకుల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఆయన సూచించారు.

సర్వీస్‌లో సీనియర్స్.. బదిలీల్లో జూనియర్స్

- బదిలీలకు నోచుకోని రీ అలోకేటెడ్ ఉపాధ్యాయులు
- పదోన్నతి కల్పించాలని భాషా పండితుల డిమాండ్



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న భాషా పండితులు

మంచిర్యాలఅర్బన్: బదిలీ, పదోన్నతుల్లో భాషా పండితులు, జీవో 317 రీఅలోకేట్ ఉపాధ్యాయుల విషయంలో సందిగ్ధం నెలకొంది. పదోన్నతి షెడ్యూల్‌లో తమను చేర్చాలని భాషా పండితులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు బదిలీల్లో తమను చేర్చకపోవడంపై 317 జీవో ప్రకారం బదిలీ అయి కోర్టు ఆదేశాలతో తిరిగి సొంత జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే భాషా పండితులు, ఉపాధ్యాయులు దశలవారీగా ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర పండిత, పీఈటీ జేఏసీ పిలుపు మేరకు ఫిబ్రవరి 1 నుంచి అన్ని ఉన్నత పాఠశాలల్లో 9, 10 తరగతుల బోధన నిలిపి వేస్తున్నట్లు భాషాపండితులు ప్రకటించారు. ఈమేరకు శనివారం డీఈవో, కలెక్టర్‌కు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. జాబ్‌చార్ట్ ప్రకారం 6,7,8 తరగతులకు బోధనకు మాత్రమే పరిమితం అవుతామంటూ నిరసనకు దిగుతున్నారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా పనిచేస్తూ సెకండరీ గ్రేడ్ హోదా వేతనం పొందుతున్నామని వాపోతున్నారు. భాషా పండితుల స్థాయిని స్కూల్ అసిస్టెంట్ స్థాయికి పెంచుతామనే హామీ నెరవేరలేదన్నారు. తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

బదిలీకోసం ఎదురుచూపులు

జీవో 317లో సొంత జిల్లాకు రి అలోకేట్ అయిన ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం, జీరో సర్వీస్ బదిలీ ఇవ్వాలని మొరపెట్టుకుంటున్నారు. జీవో 317 తప్పిదం వల్ల సీనియర్లు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చిందని వాపోతున్నారు. అప్పీలు ద్వారా తిరిగి జిల్లాకు వచ్చిన కొంతమంది ఉపాధ్యాయులకు తిరిగి తాము పనిచేసిన పాత పాఠశాలల్లో (ఓల్డ్ ప్లేస్) ఖాళీలు ఉన్నా ఇతర పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల్లో భాషా పండితులు, జీవో 317 రి అలోకేట్ అయిన ఉపాధ్యాయుల భవితవ్యంపై ఎటూ తేలకుండా పోయింది.

సాంకేతిక సమస్యలతో..

బదిలీ, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా శనివారం ఉపాధ్యాయ దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఆన్‌లైన్ నమోదుకు సాఫ్ట్‌వేర్ సమస్యలు ఉత్పన్నం కావడంతో ఇబ్బంది పడ్డారు.

లెక్కతేలిన ఖాళీలు

విద్యాశాఖలో ఖాళీలపై అధికారులు లెక్కతేల్చారు. ఇటీవల స్పౌజ్ బదిలీల్లో వచ్చిన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వడంతో మిగిలిన కేటగిరీల వారీగా ఖాళీలు ప్రకటించారు. జిల్లాలో 2,839 ఉపాధ్యాయ పోస్టుల మంజూరుకు గానూ 2,382 మంది విధులు నిర్వహిస్తుండగా 457 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఖాళీల వివరాలు

పీజీహెచ్ఎం గ్రేడ్–2	43
పీఎస్‌హెచ్ఎం	40
ఎస్ఏ (మ్యాథ్స్, తె.మీ)	6
ఎస్ఏ (మ్యాథ్స్, ఉర్దూ)	1
ఎస్ఏ (ఇంగ్లిష్)	16
ఎస్ఏ (ఫిజిక్స్, తె.మీ)	01
ఎస్ఏ (ఫిజిక్స్, ఇ.మీ)	02
ఎస్ఏ (బయోసైన్స్, తె.మీ)	40
ఎస్ఏ (బయోసైన్స్ ఉర్దూ)	03
ఎస్ఏ (సోషల్, తె.మీ)	79
ఎస్ఏ (సోషల్, ఉర్దూ)	03
ఎస్ఏ (తెలుగు)	15
ఎస్ఏ (హిందీ)	15
ఎస్ఏ (ఉర్దూ)	00
ఎస్ఏ (పీడీ)	01
ఎల్పీ తెలుగు	08
ఎల్పీ (హిందీ)	06
ఎల్పీ (ఉర్దూ)	02
పీఈటీ	02
పీఈటీ (ఉర్దూ)	01
ఎస్జీటీ (తె.మీ)	160
ఎస్జీటీ (ఉర్దూ)	11
ఎస్జీటీ (తె.మీ)	02
మొత్తం	457

అధికారుల తప్పిదంతో..



గతేడాది జీవో 317 ద్వారా నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లాను. అప్పీల్ ద్వారా తిరిగి మంచిర్యాల జిల్లాకు వచ్చాను. బదిలీకి ముందు విధులు నిర్వహించిన సింగపూర్ పాఠశాలలో ఖాళీ ఉన్నప్పటికీ కోటపల్లి మండలం సిర్సా జెడ్పీహెచ్ఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చినా పాతపోస్ట్‌లో ఇవ్వలేదు. ఇప్పటి ప్రమోషన్, బదిలీల జాబితాలో నా ఓల్డ్ ప్లేస్ ఖాళీగా చూపించారు. ఇప్పటి బదిలీల్లో పాత పాఠశాలకు తిరిగి వచ్చిన వారికి ఒకనెల స్కూల్ సర్వీస్ బ్రేక్ అయినా పాత సీనియార్టీ కౌంట్ చేస్తూ బదిలీలో అవకాశం ఇస్తున్నారు. మేం కూడా రీ అలకేట్ అయ్యాం. నా ప్లేస్ ఖాళీగా ఉన్న ఇవ్వకుండా.. 60 ఏళ్ల వయసు అని కూడా చూడకుండా కొత్త పోస్టింగ్ ఇచ్చారు. జిల్లా అధికారులు చేసిన నిర్వాహకానికి ఇప్పుడు బదిలీల జాబితాలో నా పేరు చేర్చలేదు. రీ అలోకేట్ అయిన ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలి.

– బి.నారాయణరావు, ఉపాధ్యాయుడు

లక్ష్మీదేవర బోనాలకు సర్వం సిద్ధం



ముస్తాబైన ఆలయం



ఆలయంలో లక్ష్మీదేవర

- ఆదివారం రాత్రి వేడుకలు షురూ
- సోమవారం బోనాల జాతర

చెన్నూర్: ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది చెన్నూర్‌లోని బట్టిగూడెం పాతబస్టాండ్ కాలనీలో ఉన్న లక్ష్మీదేవర ఆలయం. అనాదినుంచి ఏటా మాఘ మాసంలో అమ్మవారికి బోనాల జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండు రోజులపాటు నిర్వహించనున్న వేడుకలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

అనాదిగా వస్తున్న ఆనవాయితీ..

సుమారు నాలుగు వందల ఏళ్ల క్రితం నుంచి ఏటా లక్ష్మీదేవరకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. పంటలు చేతికి వచ్చిన తర్వాత ముదిరాజ్ కులస్తులు లక్ష్మీదేవరకు బోనాలతో మొక్కులు సమర్పించుకోవడం ఆచారంగా వస్తోంది. గోలేటి అమ్మవారి నివాస ప్రాంతమని, ఐదేళ్లకోసారి బోనాల జాతరకు రెండు నెలల ముందుగా అమ్మవారిని కాలినడకన అక్కడికి తీసుకెళ్తామని అర్చకుడు గిరెల్లి మల్లయ్య తెలిపారు.

ఆదివారం అమ్మవారు ఆగమనం

ఆదివారం ఉదయం గోదావరిలో జలశుద్ధి అనంతరం గుట్టకు వెళ్లిన లక్ష్మీదేవరను రాత్రి ఆలయానికి తీసుకువస్తారు. అనంతరం రాత్రి ఆటాపాటలు నిర్వహిస్తారు.

సోమవారం బోనాల సందడి..

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం పట్నాలు సమర్పిస్తారు. పట్నాలపైకి అమ్మవారు వచ్చిన తర్వాత బోనాల జాతర ప్రారంభమవుతుంది. ఆలయాల ప్రాంగణంలోనే భక్తులు బోనాలు ముస్తాబు చేసి నైవేద్యం సమర్పిస్తారు. జాతరకు మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

తాత, ముత్తాతల నుంచి..



మాతాత ముత్తాతల నుంచి ఆలయ అర్చకులుగా సేవలందిస్తున్నాం. నియమ నిష్ఠలతో అమ్మవారిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. 30 ఏళ్లుగా బోనాల జాతర నిర్వహిస్తున్నా. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. భక్తులు ఇచ్చిన కానుకలతోనే ఆలయ ఖర్చులు వెల్లదీస్తున్నాం.

– గిరెల్లి మల్లయ్య, లక్ష్మీదేవర పూజారి, చెన్నూర్

ఆ తల్లి సేవలో..



లక్ష్మీదేవర మహిమ గల తల్లి. 20 ఏళ్లుగా అమ్మవారి సేవలో ఉంటున్నా. బోనాలకు నెల రోజుల ముందు నుంచే కాలనీవాసులు మద్యం, మాంసాహారాలు మానేస్తారు. నియమ నిష్ఠలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు.


– గద్దం రాములు, బట్టిగూడెం కాలనీవాసి, చెన్నూర్

'బీజేపీ బలోపేతానికి కష్టపడి పని చేయాలి'

మందమర్రిరూరల్: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని పెద్దపల్లి మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ అన్నారు. మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో శనివారం జరిగిన పార్టీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో కష్టపడి పని చేసినట్లయితే బీజేపీ గెలుస్తుందని అన్నారు. పార్టీ శ్రేణులు ఎప్పుడూ ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజా సమస్యలపై ఆందోళనలు చేపట్టాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఇంచార్జి పల్లె గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

చెన్నూర్: చెన్నూర్ సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుదారి రాంబావు శనివారం మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వివేక్

క్లుప్తంగా

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



వివిధ రకాల వేషధారణలో అపరిచిత వ్యక్తులు

చెన్నూర్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. చెన్నూర్ పట్టణంలో వివిధ రకాల వేషధారణలో తిరుగుతున్న ముగ్గురు వ్యక్తుల ఫొటోలను శనివారం పోలీస్ స్టేషన్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణాలకు అన్ని ప్రాంతాల వారు వచ్చి రకరకాల వ్యాపారం, యాచించడం లాంటి పనులు చేస్తుంటారని, కాలనీలలో తిరిగే సమయంలో అలాంటి వారి కదలికలపై ప్రజలు కన్నేసి ఉంచాలన్నారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

'పక్షం రోజుల్లో ఆక్షేపణలు తెలియజేయండి'

చెన్నూర్: చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలో అక్రమంగా కలప రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలపై అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామని, శాశ్వతంగా స్వాధీనం చేసుకునేందుకు ఆక్షేపణలు ఉంటే 15 రోజుల గడువులో డివిజనల్ కార్యాలయంలో తెలియజేయాలని చెన్నూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి రేంజ్‌లలో శాశ్వతంగా స్వాధీనం చేసుకునే వాహనాల వివరాలు ప్రకటించారు. ఐచర్ వ్యాన్, మహేంద్ర జీప్, రెండు టాటా సుమోలు, ఆటో, మహేంద్రజీప్ డీఐ, బోలేరాలు ఉన్నాయని తెలిపారు. పక్షం రోజులలో ఎలాంటి ఆక్షేపణలు రాకుంటే సదరు వాహనాలను శాశ్వతంగా స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

జైపూర్: మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన మెరుగు రాజేశం(85) శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. రామారావుపేట గ్రామానికి చెందిన రాజేశం బహిర్భూమి కోసం పెద్ద చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారీ చెరువులో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాబోయ్.. దొంగలు

- జైనథ్ మండలంలోని దీపాయిగూడలో ఈ నెల 24న అర్ధరాత్రి నలుగురు దొంగల ముఠా రెండు ఇళ్లల్లో చోరీకి యత్నించింది. ఓ ఇంట్లో చొరబడి 13 తులాల బంగారం, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లింది. మరో ఇంటిఎదుట పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని సైతం దొంగిలించారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డులో శుక్రవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో దొంగలు పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి 19 తులాల బంగారం, 33 తులాల వెండి, రూ.3వేల నగదు దొంగిలించారు.
- బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో గురువారం అర్ధరాత్రి పలు ఇళ్లలోకి చొరబడ్డారు. వారి చేతుల్లో పదునైన ఆయుధాలు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వారిని చూసి కొంత మంది గ్రామస్తులు ఇండ్లలోకి వెళ్లారు. నలుగురు వ్యక్తులు గ్రామంలో తిరిగిన వీడియో సీసీ కెమెరాలో రికార్డయింది. ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు.
- ఆదిలాబాద్ బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ఓ కానిస్టేబుల్ బైక్‌ను మూడు రోజుల క్రితం దొంగలించారు. విధుల్లో భాగంగా హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరగా, తన వాహనాన్ని బస్టాండ్‌లో పార్కింగ్ చేశాడు.



బోథ్‌లోని పొచ్చెరలో రోడ్లపై సంచరిస్తున్న దొంగలు (ఫైల్)

- వరుస చోరీలతో అయోమయం
- ఆదిలాబాద్ జిల్లాలో వరుస చోరీలు
- జనాలను హడలెత్తిస్తున్న చెడ్డీ గ్యాంగ్?
- పోలీసులకు సవాల్‌గా మారిన ఘటనలు
- తాజాగా ఇచ్చోడలోని రెండిళ్లలో చోరీకి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో జనాలు భయాందోళనకు గురవుతున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ముఠా జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. పోలీసులకు సైతం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు అప్రమత్తమైనా ఆ ముఠా పట్టుబడడం లేదు. జైనథ్ మండలం దీపాయిగూడ, ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డు, బోథ్‌లోని పొచ్చెర, ఇచ్చోడలో వీరి ఆగడాలు మితిమీరాయి. తాళం వేసి ఉన్న ఇండ్లతో పాటు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ ముఠా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో చొరబడినట్లు పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు.

చెడ్డిగ్యాంగ్ పనేనా.?

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా చెడ్డి గ్యాంగా.? లేక ఇతర ఏ ముఠానా.. అని పోలీసులు ఆరా తీస్తున్నారు. జైనథ్, పొచ్చెరలో నలుగురు వ్యక్తులతో కూడిన ముఠా కాలనీలో సంచరిస్తుంతగా, ఆయా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బోథ్ మండలం పొచ్చెరలో నలుగురు వ్యక్తులు చేతుల్లో ఇనుప రాడ్లు, కత్తులతో గ్రామంలోని రోడ్లపై సంచరించారని స్థానికులు చెబుతున్నారు. ఇదే ముఠా ఇచ్చోడలో సైతం దొంగతనానికి యత్నించి ఇంట్లోని వ్యక్తులను చూసి పరారయ్యారు. నాలుగైదు రోజులుగా ఏదో ఓ చోట దొంగతనానికి పాల్పడడంతో జనాలు భయాందోళనలకు గురవుతున్నారు.

పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు..

వరుస దొంగతనాలతో ప్రజలకు, పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. దొంగలను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహన తనిఖీలు సైతం చేపడుతున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ దొంగతనాలు ఆగడం లేదు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు జిల్లాలోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వీరి ఆగడాలను నివారించలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారి ఆగడాలను పోలీసులు అరికట్టలేకపోతున్నారు.



జైనథ్‌లోని ఓ ఇంట్లో పడేసిన వస్తువులు (ఫైల్)

అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి



జిల్లాలో ఎక్కడైనా అనుమానితులు సంచరిస్తే డయల్ 100, పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్తే చుట్టూ పక్కల వారికి చెప్పి వెళ్లండి. విలువైన నగదు, బంగారం ఇంట్లో పెట్టి బయటకు వెళ్లొద్దు. జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్ బయట వ్యక్తులుగా అనుమానిస్తున్నాం. 10 ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపడుతున్నాం. గ్రామాల్లో కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ

బైక్ చోరీలు అధికమే..

జిల్లాలో బైక్ చోరీలు అధికంగానే జరుగుతున్నాయి. గతేడాది పోలీసుల లెక్కల ప్రకారం 47 ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు చెబుతుండగా, అనధికారికంగా వందల సంఖ్యలోనే ఉంటాయి. ఈ ఏడాది జనవరిలో ఇప్పటి వరకు అధికారికంగా నాలుగు వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయని వారు పదుల సంఖ్యలో ఉంటారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రిమ్స్ ప్రాంతంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ఏడాది దాదాపు రూ.2 కోట్ల నగదు వరకు ఎత్తుకెళ్లగా ఈ ఏడాదిలో దాదాపు 30 తులాలకు పైగా బంగారం, రూ.లక్షలోపు నగదు దోచుకుపోయారు.

ఇచ్చోడలో చోరీకి యత్నం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్, సాయినగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. విద్యానగర్‌లోని ఇందారపు బాలకృష్ణ, సాయినగర్‌లోని తృప్తి గంగాధర్ ఇళ్లల్లో అర్ధరాత్రి ఇంటి డోర్‌లకు డ్రీల్ ద్వారా రంధ్రాలు చేసి ఇళ్లలోకి చొరబడ్డారు. చప్పుడు కావడంతో బాలకృష్ణ కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. పక్కనే ఉన్న సాయినగర్‌లోని గంగాధర్ ఇంట్లో చోరీకి యత్నించారు. వారు వెంటనే 100 డయల్‌కు కాల్ చేయడంతో పోలీసులు రావడాన్ని గమనించి పరారయ్యారు. శనివారం ఉదయం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సీఐ నైలు, ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భయాందోళనలకు గురికావద్దు....

ప్రజలు భయాందోళనలకు గురికావద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సాయంత్రం మండల పోలీస్‌స్టేషన్ సందర్శించి మాట్లాడారు. జిల్లా పోలీసు యంత్రాగం పూర్తిగా అప్రమత్తంగా ఉందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఉంటే వెంటనే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఎస్పీ



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ నైలు

'బ్యాంకర్లు రైతుబంధు డబ్బులు ఇవ్వాలి'



మాట్లాడుతున్న ఖలెందర్ అలీఖాన్

జన్నారం: రైతుబంధు పథకం డబ్బులు బ్యాంకర్లు రైతులకు ఇవ్వాలని, పంట రుణాల రెన్యూవల్ పేరిట తీసుకోవడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలెందర్ అలీఖాన్ అన్నారు. శనివారం జన్నారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి లేక రోడ్డున పడుతున్నారని ఆరోపించారు. అప్రకటిత కరెంటు కోతలతో ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. పోడు సమస్యపై అధికారులు దృష్టి సారించాలని, అర్హులకు హక్కు పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 22న సీపీఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, కన్వీనర్ మామిడి విజయ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎంసీసీ భూమి స్వాధీనం చేసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎంసీసీ సిమెంటు పరిశ్రమకు కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని బీజేపీ నాయకులు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సిమెంట్ ఫ్యాక్టరీ కోసం గతంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్, ఇనాం, ప్రభుత్వ భూములు, పట్టాభూములను కేటాయించిందని తెలిపారు. ప్రస్తుతం కంపెనీ మూతపడిందని, యంత్రాలను అమ్ముకుంటోందని, భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విక్రయించేందుకు సిద్ధపడ్డారని పేర్కొన్నారు. భూమిని స్వాధీనం చేసుకుని రైతులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూదన్‌రావు, ఓబీసీ జిల్లా మాజీ అధ్యక్షుడు లింగన్నపేట విజయ్‌కుమార్, మంచిర్యాల పట్టణ ఉపాధ్యక్షుడు సోము ప్రదీప్‌చంద్ర, నాయకులు మల్లేష్, శేఖర్ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు సై..



కూరగాయలు, ఆకు కూరలు తెంపుతున్న కూలీలు

- సేంద్రియ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరల సాగు
- వరించిన పుడమిపుత్ర అవార్డు
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు సతీశ్

చెన్నూర్‌రూరల్: రసాయనిక ఎరువులతో మనం తినే ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించాలనే సంకల్పంతో మంచిర్యాల జిల్లాలో పలువురు రైతులు సేంద్రియ సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ కోవలోకి చెందిన వాడే చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామానికి చెందిన యువరైతు గోనె సతీశ్. 14ఏళ్లుగా సేంద్రియ ఎరువులతోనే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ లాభాలు గడిస్తున్నాడు.

ఆకుకూరలు, కూరగాయల సాగు...

తమ ఇంటి వద్ద ఉన్న ఎకరం స్థలంతో పాటు గ్రామంలో మరో మూడెకరాల వరకు భూమిని కౌలుకు తీసుకుని సుమారు 20రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. వంకాయ, కాకర, బెండ, మిర్చి, టమాట, బీర, అల్చంత, చిక్కుడుకాయ, సోరకాయ, దొండకాయలతో పాటు తోటకూర, పాలకూర, గోంగూర, మెంతి, కొత్తిమీరు వంటి పంటలను సాగు చేస్తున్నాడు. వీటి సాగుకు సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగిస్తున్నాడు. ముఖ్యంగా జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం అనే సేంద్రియ ఎరువులను ఇంటి వద్దే తయారు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువుల తయారీకి ఆవు మూత్రం, ఆవు పేడ కోసం ఇంటి వద్దే పశువులను పెంచుతున్నారు. వేసవి కాలంలోనైతే కూరగాయలకు మరింత డిమాండ్ పెరుగుతుండడంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు.



సేంద్రియ ఎరువును కలుపుతున్న రైతు సతీశ్

సతీశ్ దంపతులకు పుడమి పుత్ర అవార్డు

14 ఏళ్లుగా సహజ సిద్ధమైన ఎరువులతో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేయడమే కాకుండా, సేంద్రియ ఎరువులను అవసరం ఉన్న రైతులకు అందిస్తున్నాడు. అంతే కాకుండా చెన్నూర్ పట్టణంలో కూరగాయల దుకాణాన్ని సైతం ఏర్పాటు చేశాడు. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తూ పడమితల్లిని కాపాడుతున్నందుకు గాంధీ గ్లోబల్ సంస్థ వారు గత ఏడాది కర్నూల్‌లో రైతు సతీశ్, రజిత దంపతులకు పుడమి పుత్ర అవార్డును అందజేశారు.

నాలుగేళ్లుగా సాగు



సేంద్రియ ఎరువులను వాడుతూ నాలుగేళ్లుగా కూరగాయలను సాగు చేస్తున్నాను. రైతులు ఆవు పేడ, బెల్లం, శనగపిండితో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నాను. జీవామృతం ఎరువు పంటలకు బాగా ఉపయోగపడుతుంది. ఇది ఇళ్ల వద్ద, పెరళ్లు, తోటలు, చేన్ల వద్ద నే తయారు చేసుకోవచ్చు. –డెబ్బ రామన్న, రైతు, ఎర్రగుంటపల్లి

సేంద్రియ ఎరువులు వాడుతున్నాను



సేంద్రియ ఎరువులను వాడి పంటలు సాగు చేస్తున్నాడు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచిస్తున్నాం. సేంద్రియ ఎరువులతో పెట్టుబడులు తక్కువగా ఉంటున్నాయి. మంచి దిగుబడులు వస్తున్నాయి.

– సతీశ్, రైతు, శివలింగాపూర్

వాహనం అదుపుతప్పి ఒకరు మృతి



సమ్మయ్య మృతదేహం



సమ్మయ్య(ఫైల్)

కోటపల్లి(చెన్నూర్): వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన కోటపల్లి మండలంలోని లక్ష్మీపూర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... అన్నారం గ్రామానికి చెందిన గొల్లగట్టు సమ్మయ్య (25) ఉదయం టమాటాలు అమ్మడానికి తన బొలెరో వాహనంలో సిరోంచకు బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన తాళ్ల రమేశ్, సయ్యద్‌బాబా, కొండపర్తి మహేశ్ వేర్వేరు పనుల నిమిత్తం సిరొంచకు వెళ్తూ అదే వాహనం ఎక్కారు. లక్ష్మీపూర్ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ సమ్మయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. తాళ్ల రమేశ్, సయ్యద్‌బాబా, మహేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకట్ సంఘటన స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెంకట్ తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

మందమర్రిరూరల్(చెన్నూర్): రాష్ట్రం, దేశానికి హాని చేసే పార్టీలను తరిమికొట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయానంద్ పిలుపునిచ్చారు. శనివారం మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సంర్రోనిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ వేల్పుల రవి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సంజీవరావు, సోషల్ మీడియా మండల కన్వీనర్ గౌతమ్, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్



తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సిర్పూర్(టి): గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ... మండలంలోని చీలపల్లి గ్రామ శివారులో నగపూరే పురుషోత్తం, చౌదరి పురుషోత్తం, వడ్డె ఉమాజీ, సెండే బాబాజీ గుప్తనిధుల కోసం శనివారం తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఆయన వెంట అదనపు ఎస్సై గుర్లే రాకేశ్ ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న టి.సాగర్

కోటపల్లి(చెన్నూర్): కాళేశ్వరం బ్యాక్ వాటర్ ముంపు రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. శనివారం కొల్లూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్, జిల్లా అధ్యక్షుడు సంకే రవి, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి చందు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పున్నం ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో విలక్షణ తీర్పు

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14 మందికి న్యాయమూర్తి ఉపనిషద్వని శనివారం విలక్షణమైన తీర్పునిచ్చారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన వారిని ట్రాఫిక్ సీఐ నరేష్ కుమార్ కోర్టులో హాజరుపర్చగా కేసు విచారించిన న్యాయమూర్తి 14 మంది మందు బాబులు రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు కేంద్రంలో పారిశుధ్య పనులు చేయాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు. అలా చేయనిపక్షంలో పది రోజులు సాధారణ జైలుశిక్ష విధించనున్నట్లు వెల్లడించారు.

పెట్రోల్ బంక్ సీజ్



పెట్రోల్ బంకును సీజ్ చేసిన సిబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తోళ్లవాగు వద్ద గల రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో డీలర్ నిబంధనలు పాటించడం లేదని ఆ కంపెనీ సిబ్బంది శనివారం సీజ్ చేశారు. దీంతో డీలర్ సుధాకర్ వారిని అడ్డుకోవడంతో కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. సదరు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని గొడవను సద్దుమనిచారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బంది మాట్లాడుతూ బంక్‌లో నిబంధనలు పాటించాలని పలుమార్లు సూచించినప్పటికీ పట్టించుకోకపోవడంతోనే సీజ్ చేసినట్లు తెలిపారు.

పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పశుమిత్రలు

పాతమంచిర్యాల: పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్న పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చార్వాక ట్రస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి మాట్లాడుతూ ఎలాంటి పారితోషికం, వేతనం లేకుండా ఎనిమిదేళ్లుగా పశుమిత్రలు ఉచిత సేవలు అందిస్తున్నారన్నారు. పశుమిత్రల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1న 'చలో హైదరాబాద్' నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీలత, కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా లావణ్య, ఉపాధ్యక్షులుగా మల్లిక, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా స్వప్న, నీరజ, సభ్యులుగా మంజుల, సరోజ, లక్ష్మి, సరిత, శ్రీలత, రాజేశ్వరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం పాల్గొన్నారు.